క్లుప్తంగా

స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించు కుని స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. గురువారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహా గణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

ఊయలసేవ

శ్రీశైల భ్రమరాంబాదేవికి గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను ఊయలలో ఆశీనులను చేసి షోడశోపచార పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి,ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

స్మార్ట్ మీటర్ల భారాన్ని తొలగించాలి

ఆత్మకూరు: స్మార్ట్ మీటర్ల భారాన్ని తొలగించాలని సీపీఎం నాయకులు రణధీర్ డిమాండ్ చేశారు. ధనుంజయ మీటింగ్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజల మెడల్ని ఉచ్చుతాడు బిగించేలా చేస్తోందన్నారు. వ్యాపార సముదాయాలకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించారని, 200 యూనిట్లు పైబడిన విద్యుత్ బిల్లులు వచ్చే వారికి కూడా ఈ స్మార్ట్ మీటర్లు బిగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు సురేంద్ర, మాబాషా, సద్దాంహుసేన్, వీరన్న, నాగేశ్వరరావు, వలీ, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మౌలాలి స్వామి జార్తలు



మౌలాలి స్వామి గ్రామోత్సవంలో భక్తజనం

మహానంది: గాజులపల్లె గ్రామంలో మౌలాలి స్వామి జార్తలు గురువారం ముగిసింది. మౌలాలి స్వామి గ్రామోత్సవం మధ్యాహ్నం వరకు జరిగింది. మౌలాలి స్వామి పీరు మఖానం చేరుకునే సరికి భక్తులు చప్పట్లతో భక్తిని చాటు కున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరయ్యారు.

శ్రీశైలంలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేస్తున్న దేవస్థాన డీఈఓ, ఏఈఓ, అధికారులు, సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: స్వచ్ఛసేవా కార్యక్రమంలో భాగంగా గురువారం క్షేత్ర పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ముందుగా రథశాల నుంచి నందిమండపం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారులు, ఆరుబయలు ప్రదేశాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రమణమ్మ, ఏఈఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హరికథాగానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై భీమవరానికి చెందిన పాల రామాంజనేయులు భాగవతార్ వారి భక్తమార్కండేయ హరికథాగానం అలరించింది. మృదంగ సహకారాన్ని హరికృష్ణ, వయోలిన్ సహకారాన్ని గురుప్రసాద్ అందించారు.

విద్యార్థిపై తేనెటీగల దాడి

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి యు.నరసింహపై గురువారం తేనెటీగలు దాడి చేయడంతో మెడ దగ్గర వాపు వచ్చింది. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు విద్యార్థికి సపర్యలు చేసి కాసేపు విశ్రాంతి ఇచ్చారు. కాగా 6, 7 తరగతి గదులకు వెళ్లే సమయంలో మెట్ల వద్ద ఉన్న తుట్టెలు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

- పల్లెపండుగ రోడ్లు వేసి 9 నెలలైనా మంజూరు కాని బిల్లులు
- 15.46కోట్లతో నియోజకవర్గంలో 236 సిమెంటు రోడ్ల నిర్మాణం
- ఎంపీ ల్యాడ్స్ కింద రూ.1.29 కోట్లు మంజూరైనా ప్రారంభం కాని పనులు

పల్లె పండగన్నారు... పస్తులుంచుతున్నారు!

జూపాడుబంగ్లా: పల్లెపండుగంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన కూటమి నేతలు పనులు చేసిన కార్యకర్తలకు బిల్లులివ్వకుండా పస్తులుంచటం ఎంతవరకు సబబంటూ తెలుగు తమ్ముళ్లు ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, పాములపాడు, పగిడ్యాల, కొత్తపల్లి, నందికొట్కూరు, మిడ్తూరు మండలాల పరిధిలోని 44 గ్రామ పంచాయతీలకు రూ.15.42 కోట్లతో 236 సిమెంటు రోడ్లు మంజూరు చేశారు. రోడ్ల నిర్మాణ పనులు పూర్తై తొమ్మిది మాసాలైనా ఇప్పటిదాకా బిల్లులు మంజూరు చేయకపోవటంతో అప్పులు తెచ్చి రోడ్లు నిర్మించిన తెలుగు తమ్ముళ్లు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా రెండోవిడతగా ఎంపీ ల్యాడ్స్ కింద జూపాడుబంగ్లా మండలానికి రూ.34 లక్షలు. కొత్తపల్లి కి రూ.15లక్షలు, మిడుతూరుకు రూ.10 లక్షలు, నందికొట్కూరు రూ.12లక్షలు, పగిడ్యాల రూ.40లక్షలు, పాములపాడు మండలానికి రూ.18లక్షల చొప్పున నిధులు మంజూరు కాగా ఈ నిధులతో సిమెంటు రోడ్లు నిర్మించాల్సి ఉండగా ఇప్పటిదాకా పనులు ప్రారంభం కాకపోవటం గమనార్హం.



సిమెంటు రోడ్డు నిర్మిస్తున్న తాపీవర్కర్లు(ఫైల్)

ప్రారంభం కాని ఎంపీ ల్యాడ్స్ పనులు

పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవటంతో నాలుగు మాసాల క్రితం జూపాడుబంగ్లా, కొత్తపల్లి, మిడుతూరు, నందికొట్కూరు, పగిడ్యాల, పాములపాడు ఎంపీ ల్యాండ్స్ కింద రూ.1.29కోట్లతో 14 గ్రామ పంచాయతీలకు సిమెంటు రోడ్లు మంజూరయ్యాయి. పల్లెపండుగ కార్యక్రమంలో నిర్మించిన సిమెంటు రోడ్లకే బిల్లులు మంజూరు కాకపోవటంతో రెండో విడతగా ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన నిధులతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మించేందుకు గ్రామాల్లోని తెలుగు తమ్ముళ్లు ముందుకు రాకపోవటంతో నేటికీ ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన సిమెంటు రోడ్ల నిర్మాణం పనులు పూర్తి కాలేదు.

డిసెంబర్ నెలాఖరులోగా పనులు పూర్తిచేస్తాం

సీనియార్టీ జాబితా ప్రకారం పల్లెపండుగ పనులుచేసిన వారికి 43 శాతం మేర బిల్లులు మంజూరయ్యాయి. వాటిని వారంలోగా కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాల్లో జమచేసే అవకాశాలున్నాయి.ఎంపీ ల్యాడ్స్ పథకం కింద సిమెంటు రోడ్ల నిర్మాణం పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

–రామ్మోహన్, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ, నందికొట్కూరు

శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు చేస్తూ దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మకు ప్రస్తుతం ఉన్న విధులతోపాటు అదనంగా అకౌంట్ సెక్షన్, సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డికి రెవెన్యూ సెక్షన్, సహాయ కార్యనిర్వహణాధికారి కె.వెంకటేశ్వరరావుకు పడితరం, స్టేషనరీ, సెక్యూరిటీ సర్వీసులు, జి.స్వాములుకు గోశాల విభాగం, సీహెచ్.శ్రీనివాసరెడ్డి కి క్యూకాంప్లెక్స్, డొనేషన్ కౌంటర్, ఆర్జితసేవలు, లీగల్ సెక్షన్, వై.సతీష్ మల్లిక్‌కు అన్నప్రసాదం విభాగం, లడ్డూ సేల్స్ కౌంటర్, ఎం.ఫణిధరప్రసాద్‌కు కర్నూలు సమాచార కేంద్రం పూర్తి పర్యవేక్షణ విధులు కేటాయించారు. క్యూకాంప్లెక్స్ వద్ద విధులు నిర్వహిస్తున్న పర్యవేక్షకురాలు టి.హిమబిందును గోశాల విభాగానికి, కె.అయ్యన్నకు క్యూకాంప్లెక్స్ పర్యవేక్షణ, పి.రాజశేఖర్‌కు ఎస్టాబ్లిష్‌మెంట్, ఇ.మల్లికార్జునకు లీగల్ సెక్షన్, వి.హరికృష్ణారెడ్డికి అదనంగా దేవస్థానం పెట్రోల్‌బంక్ కేటాయించారు. పలువురు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్లను కూడా అంతర్గత బదిలీలు చేస్తూ కేటాయించిన స్థానాల్లో తక్షణమే చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైభవంగా శాకంబరీ ఉత్సవం



మహానందిలో శాకంబరీ పూజలు నిర్వహిస్తున్న ఈఓ, పండితులు



శాకాంబరి అలంకరణలోని అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

మహానంది: ఆషాడ మాసం, పౌర్ణమి సందర్భంగా గురువారం మహానందిలో శాకంబరీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ముఖ్య అర్చకులు రాజమాణిక్య శర్మ, పండితులు, అర్చకులు తెల్లవారుజామున కామేశ్వరీ దేవి అమ్మవారికి విశేష అభిషేకం, శాఖాలంకారం చేశారు. వివిధ కూరగాయలు, పండ్లతో సహస్ర నామార్చన, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. శాకంబరీ ఉత్సవానికి హైదరాబాద్ ఎల్బీనగర్ మార్కెట్ వ్యాపారులు రెండు టన్నుల కూరగాయలు, పండ్లను పంపించినట్లు ఈఓ తెలిపారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్‌లు అంబటి శశిధర్ రెడ్డి, నీలకంఠేశ్వరరాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

తూర్పు ప్రాతకోట గ్రామంలో..

పగిడ్యాల: మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో వెలసిన గంగా పార్వతీ దేవి అమ్మవార్లను శాకంబరి అలంకరణలో ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని పంచామృత అభిషేకాలు జరిపించి, వివిధ కూరగాయాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



శ్రీశైలంలో పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు



పాములపాడు మండలం జూటూరులో సాయిబాబా ఆలయంలో హారతి ఇస్తున్న పీఠాధిపతి



పగిడ్యాల: సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



ఆత్మకూరులో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు: స్థానిక సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను భక్తులు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు సాయిబాబా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం కనుల పండువగా సాగింది. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డితోపాటు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

శ్రీశైలంలో ..

శ్రీశైలంటెంపుల్: గురుపౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి–హేమారెడ్డి మల్లమ్మ మందిరం వద్ద, దక్షిణామూర్తిస్వామికి, వ్యాసమహర్షికి, త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి విశేషపూజలు జరిపించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులతోపాటు ఏఈఓ ఎం.హరిదాసు, ఆలయ ప్రధానార్చకులు వీరన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని జూటూరు, వాడాల గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలను ప్రజలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి ఆలయాలకు చేరుకుని కాయ, కర్పూరాలు సమర్పించి స్వామిని దర్శించుకున్నారు. జూటూరు గ్రామంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో పీఠాధిపతి శ్రీరామానందస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెలుగోడు: పట్టణని షిరిడీ సాయిబాబా ఆలయంలో సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహానంది: గురుపౌర్ణమి సందర్భంగా తిమ్మాపురం, అల్లినగరం, బుక్కాపురం, అబ్బీపురం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఆలయాలకు చేరుకుని సాయిబాబాను దర్శించుకున్నారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కొలనుభారతి ఆలయంలో..

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతి దేవి ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ పురోహితులు శ్రీనివాస శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శణ భాగ్యం కల్పించారు. చిన్నారులకు పురోహితులు అక్షరాభ్యాసం చేయించారు.



సాముహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం



వెలుగోడులో పూజల్లో పాల్గొన్న భక్తులు



అల్లినగరం సాయిబాబా ఆలయంలోని పూజల్లో పాల్గొన్న భక్తులు

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

కొత్తపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని వెన్నెలా గార్డెన్స్‌లో సీపీఐ మండల మహాసభను మండల కార్యదర్శి కేతం వెంకటశివుడు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా బస్టాంట్ నుంచి వెన్నెల గార్డెన్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సంగమేశ్వరం వద్ద కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి బదులు బ్రిడ్జీ కమ్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టి రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 30, 31 తేదీలలో డోన్‌లో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.



సీపీఐ జెండాను అవిష్కరిస్తున్న నాయకులు

అవగాహన సదస్సు

నందికొట్కూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వం న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవ సంస్థ అధ్యక్షులు ఎ.శోభరాణి మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో ఉన్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం చేయాలన్నారు. మధ్యవర్తిత్వం వల్ల కలిగే లాభాలను కక్షిదారులకు తెలియజేయాలన్నారు. ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు అవగాహన సదస్సులు జరుగుతునట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది వెంకటరాముడు, పారాలీగల్ వలంటీర్లు శోభరాణి, కేజియా, రెహమాన్, హుసేన్ పాల్గొన్నారు.



కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభరాణి

బీఎల్‌ఓలు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

జూపాడుబంగ్లా: బీఎల్‌ఓ(బూత్‌లెవెల్ అధికారులు)లు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, నందికొట్కూరు నియోజకవర్గ ఎలక్షన్ డీటీ మధుసుధాకర్ సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్‌ఓల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఓటరు జాబితాలో కొత్త ఓటర్లను చేర్చే సమయంలోనూ, మృతిచెందిన వారిని తొలగించే సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ కళావతి పాల్గొన్నారు.



బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న నియోజకవర్గ ఎలక్షన్ డీటీ మధుసుధాకర్

జాబితాలో పేర్లు సరిచూసుకోండి

వెలుగోడు: అన్నదాత–సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రం వద్ద ప్రదర్శించామని, రైతులు పేర్లు సరిచూసుకోవాలని ఏఓ స్వాతి గురువారం తెలిపారు. ఆధార్ నంబరు ద్వారా 'నో యువర్ స్టేటస్'లో నకలు తీసుకోవచ్చన్నారు. 'మన మిత్ర వాట్సాప్' ద్వారా కూడా లబ్ధిదారుల వివరాలను తెలుసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. జాబితాలో పేరు లేని రైతులు రైతు సేవా కేంద్రంలో ఈనెల 13లోపు ఆధార్, భూమి వివరాలతో తగిన ధ్రువపత్రాలు సమర్పించి, గ్రీవెన్స్ మాడ్యూల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కేంద్రం పీఎం కిసాన్ నిధులను విడుదల చేస్తే రోజే రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత– సుఖీభవ నగదు విడుదల చేయనుందన్నారు.



అన్నదాత సుఖీభవ జాబితాను పరిశీలిస్తున్న రైతులు

కేసు నమోదు

జూపాడుబంగ్లా: రోడ్డుప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7న తాటిపాడు గ్రామంలో పీర్ల పండగను చూసేందుకు సోఫిసాహెబ్ బైక్‌పై వస్తుండగా అదే గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా అతివేగంగా రాంగ్‌రూట్లో బైక్‌పై వచ్చి ఢీకొన్నాడన్నారు. తీవ్రంగా గాయపడిన సోఫిసాహెబ్ చికిత్స అనంతరం కోలుకున్న తర్వాత ఫిర్యాదు చేయడంతో మహబూబ్‌బాషాపై కేసు నమోదు చేశామన్నారు.

గ్రామాల్లో బస్సులు ఆపాలి

నందికొట్కూరు: విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను గ్రామాల బస్టాండ్ వద్ద ఆపాలని ఎస్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షులు సాయికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ 10 బొల్లవరం, బ్రాహ్మణకొట్కూరు గ్రామాల విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు సమయానికి చేరుకోవాలంటే ఆత్మకూరు, నందికొట్కూరు డిపోల ఆర్టీసీ బస్సులు ఆపాలన్నారు. ఆర్టీసీ బస్సులు ఆపకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు శంకర్, ధనుంజయ్, మున్నా పాల్గొన్నారు.

నేడు ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ సమావేశం

బండి ఆత్మకూరు: మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరులోని ఎల్‌వీ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బారెడ్డి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలన్నారు.

షాదీఖానాలో వసతులు కల్పించాలి

వెలుగోడు: పట్టణంలోని షాదీఖానాలో కనీస వసతులు కల్పించాలని ఎస్‌డీపీఐ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు ఆరిఫ్ ఖాన్, షఫీ, బాషా, ఫజుల్లా గురువారం కలెక్టర్ రాజకుమారిని కోరారు. మెగా పేరెంట్స్ ఈవెంట్‌కు హాజరైన కలెక్టర్‌ను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు.

పిల్లలను బాగా చదివించాలి

సాక్షి నెట్‌వర్క్: ప్రతిఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. గురువారం శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల వ్యాప్తంగా అన్ని పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని అధికారులు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలున్నాయని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదించాలని కోరారు. మౌలిక వసతులతో పాటు అర్హులైన ఉపాధ్యాయులున్నారని, చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పుతారని తెలిపారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఏర్పాటు చేసిన ఆటలపోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సహపంక్తి భోజనం చేశారు.



బండి ఆత్మకూరులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఐసీడీఎస్ పీడీ లీలావతి



హైవేపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

నిర్లక్ష్యంపై నిరసన

నేషనల్ హైవే 340సీ నిర్మాణంలో భాగంగా పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామంలో తాగునీటి పైపులైన్ ధ్వంసమైంది. దీంతో తుమ్మలూరు, క్రిష్ణాపురం గ్రామస్తులకు తాగునీటి సమస్య నెలకొంది. నూతన పైపులైన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరినా కాంట్రాక్టర్ దక్కించుకున్న పీఎస్‌కే సంస్థ ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తామని, కొత్త పైప్ లైన్ వేసేది లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు ఖాళీ బిందెలతో హైవేపై గురువారం ధర్నాకు దిగారు. సుమారు 2 గంటల వరకు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎస్‌ఐ సురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆర్డీఓ అక్కడి నుంచే నేషనల్ హైవే పీడీ పద్మజతో ఫోన్‌లో మాట్లాడారు. ఆమె గ్రామానికి చేరుకుని పరిశీలిస్తామని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ప్రజలు నిరసన విరమించారు.

– పాములపాడు